# అవినీతిపరులే కమిటీ సభ్యులా!

**వీసీ మాట నిలబెట్టుకోవాలి**
**ప్రిన్సిపాల్ అధ్యక్షతన తక్షణమే కమిటీ వేయాలి**




**తెలుగు క్యాంపస్ జై భీం న్యూస్, వరంగల్:**

కాకతీయ యూనివర్సిటీ హాస్టల్స్‌లో జరుగుతున్న అవినీతిపై ఉపకులపతి ఆచార్య ప్రతాప్ రెడ్డి విద్యార్థుల సమక్షంలో ఇచ్చిన మాట ప్రకారం వేయాల్సిన విచారణ కమిటీలో గతంలోనే అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులను, ప్రస్తుతం అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను సభ్యులుగా పెట్టడం "దొంగకు తాళం చేయించి కాపలా ఖాయం" అన్నట్లుందని విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రంకు వినతిపత్రం సమర్పించిన విద్యార్థులు మాట్లాడుతూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులతోనే కమిటీ ఏర్పాటు చేయడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఇది అధికార దుర్వినియోగమేనని, యూనివర్సిటీ సొమ్మును అవినీతిపరులకు కట్టబెట్టే ప్రయత్నంగానే భావిస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**విద్యార్థులు కోరిన ప్రధాన అంశాలు..**

వీసీ ఇచ్చిన మాట నిలబెట్టుకుని తక్షణమే అవినీతి ఆరోపణలు లేని యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌ను చైర్మన్‌గా పెట్టి కొత్త కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రస్తుత కమిటీలో ఉన్న అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను వెంటనే తొలగించాలి. గతంలో అవినీతి ఆరోపణలపై కమిటీలు వేసి నివేదికలు ఇచ్చినా చర్యలు తీసుకోని అధికారులు ఇప్పుడు ఆ నివేదికలు "మాయం" చేసిన వ్యక్తులనే మళ్లీ కమిటీల్లో పెట్టడం దుర్మార్గమని ఖండించారు. ఇకపై రానున్న కాలంలో ఏ కమిటీలోనూ అవినీతి ఆరోపణలు ఉన్న వ్యక్తులను సభ్యులుగా పెట్టరాదు. పైరవీలకు లొంగి ఇలా చేస్తే విశ్వవిద్యాలయం పరిస్థితి ఏమిటవుతుందని ప్రశ్నించారు. అవినీతి ఆరోపణలున్న వ్యక్తులను కమిటీల్లో కొనసాగించినట్లయితే యూనివర్సిటీ నియమాలను బేకాదారు చేసిన వారుగా అధికారులు పరిగణించబడతారని, తదుపరి పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నేతలు పలువురు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లాలో 'డైల్ యువర్ ఎస్పీ' కార్యక్రమం ప్రారంభం

**వికారాబాద్, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్):**




జిల్లా ప్రజలకు మరింత చేరువ కావడానికి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించే లక్ష్యంతో వికారాబాద్ జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి సోమవారం 'డైల్ యువర్ ఎస్పీ' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభ రోజైన సోమవారం ఈ కార్యక్రమానికి అద్భుత స్పందన లభించింది. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధి నుంచి మొత్తం 26 కాల్స్ వచ్చాయి. ఫిర్యాదుల స్వరూపం: మహిళల భద్రత, మాడిఫైడ్ సైలెన్సర్ల వాహనాల ఇబ్బంది, అక్రమ ఇసుక-ఎర్రమట్టి రవాణా, భార్యాభర్తల మధ్య గొడవలు, పొలాల్లోకి అక్రమ ప్రవేశాలు, మండల కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్యలు తదితర అంశాలపై ఫిర్యాదులు నమోదయ్యాయి. "సుదూర ప్రాంతాల నుంచి ఎస్పీ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా ఫోన్ ద్వారానే ప్రజల సమస్యలను తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యం" అని ఎస్పీ తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 11:00 నుంచి 12:00 గంటల వరకు ఎస్పీ స్వయంగా ఫోన్‌ను అటెండ్ చేస్తారు. సంప్రదించాల్సిన నంబర్: 08416-255601 ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్మీ అధికారులు




**హనుమకొండ, నవంబర్ 17(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్‌లో చెన్నై ఆర్మీ రిక్రూటింగ్ డీడీజీ బ్రిగేడియర్ ఆర్.కె. అవస్థి, సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ డైరెక్టర్ కల్నల్ సునీల్ యాదవ్ సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించిన ఏర్పాట్లు, నిర్వహణ, భద్రతా చర్యలు, అభ్యర్థుల సౌకర్యాలు తదితర అంశాలపై ఆర్మీ అధికారులు కలెక్టర్‌తో చర్చించారు. బ్రిగేడియర్ అవస్థి, కల్నల్ సునీల్ యాదమ్‌డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేషన్ అందిస్తున్న సహకారంపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

## పత్తి రైతుల కష్టాలపై బీఆర్‌ఎస్ ఆగ్రహం

**ఎనుమాముల యార్డులో ధర్నా**

**హసన్‌పర్తి, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)**



పత్తి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం వరంగల్ ఎనుమాముల మార్కెట్ యార్డు వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లలో కావాలనే ఆలస్యం చేస్తూ, అనవసర కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, సకాలంలో సక్రమమైన పత్తి కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ రాష్ట్ర%-%జిల్లా నాయకులు హాజరుకానున్నారు. నిరసనను విజయవంతం చేయడానికి రైతులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ డైరెక్టర్లు, గ్రామ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనాలని హసన్‌పర్తి మండల బీఆర్ఎస్ అధ్యక్షులు బండి రజని కుమార్ పిలుపునిచ్చారు.

## వయోజనుల్లో అక్షరాస్యత పెంపుకు హసన్‌పర్తిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం



**హసన్‌పర్తి, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వ యస్ఇఆర్‌పి సీఈఓ ఆదేశానుసారం, మండలంలో వయోజన విద్యా కార్యక్రమం భాగంగా "అమ్మకు అక్షరమాల-అందరికీ విద్య" అనే ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. మహిళల్లో అక్షరాస్యత పెంపొందించడం, చదువు అవకాశాలు కోల్పోయిన వయోజనులను విద్యావంతులుగా తీర్చడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ శిక్షణలో వివోఏలు, గ్రామ సమాఖ్యల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులకు వయోజన విద్యా అమలు విధానాలు, బోధనా పద్ధతులు, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాల నిర్వహణపై వివరంగా సూచనలు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ పద్మప్రియ మాట్లాడుతూ, అక్షరాస్యత పెరగడం ద్వారా మహిళల ఆత్మవిశ్వాసం, కుటుంబాల అభివృద్ధి, సమాజిక చైతన్యం మరింత బలపడుతుందని తెలిపారు. "అమ్మకు అక్షరమాల%-%అందరికీ విద్య" కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో చదువు వెలుగులు విస్తరించేలా చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ నారాయణ, మండలంలోని విలేజ్ ఆర్గనైజేషన్ ఆఫీస్ బేరర్స్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రతిజ్ఞ దివస్ సందర్భంగా గోడపత్రిక ఆవిష్కరణ

### వివిధ సేవా కార్యక్రమాలకు శ్రీకారం



**హన్మకొండ, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)**

స్వేరోస్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదినం పురస్కరించుకొని నవంబర్ 23వ తేదీని ప్రతిజ్ఞ దివస్ గా నిర్వహించేందుకు భాగంగా, వారం రోజుల పాటు జరగబోయే వివిధ కార్యక్రమాల ప్రారంభ సూచికగా సోమవారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్ వద్ద గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సేవా దినోత్సవం, జ్ఞాన జ్యోతి దినోత్సవం, ప్రేరణ దినోత్సవం, స్వేరోవిందు, పర్యావరణ దినోత్సవం, నాయకత్వ దినోత్సవం మరియు ప్రతిజ్ఞ దినోత్సవం వంటి పలు థీమ్‌ల ఆధారంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో స్వేరోస్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బల్గూరి దుర్గయ్య, రాష్ట్ర అధ్యక్షులు వీరయ్య, ఎస్ఆర్పీలు, రాష్ట్ర%-%జిల్లా స్వేరోస్ నాయకులు, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థి విభాగం, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తిలో ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



**ఎల్కతుర్తి, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజలు విశేషంగా స్పందించారు. కాకతీయ వైద్య కళాశాల, ఎంజీఎం ఆసుపత్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఎల్కతుర్తి గ్రామపంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ శిబిరాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రారంభించి, ఓపీ నమోదు, హెల్ప్ డెస్క్, ల్యాబ్, ప్రాథమిక పరీక్షల కౌంటర్లను పరిశీలించారు. జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, సర్జరీ, పీడియాట్రిక్, ఈఎన్టీ, డెర్మటాలజీ, ఛాతీ వ్యాధులు, కంటి, గైనకాలజీ విభాగాల్లో నిపుణులు సేవలందించారు. మొత్తం 38 మంది స్పెషలిస్టులు, 60 మంది పీజీ విద్యార్థులు, జిల్లా వైద్యశాఖ నుంచి 35 మంది డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. 170 మందికి చికిత్స అందించగా, 115 మందిని మరిన్ని పరీక్షల కోసం ఎంజీఎం, జీఎంహెచ్‌లకు రిఫర్ చేశారు. వరంగల్ కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ రూ.15,000 విలువైన ఉచిత మందులు అందజేసింది. కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్య, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, తహసీల్దార్ ప్రసాద్ రావు, ఎంపీడీఓ విజయ్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వాకథాన్




**హనుమకొండ, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్):**

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం హనుమకొండలో వాకథాన్ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఆర్ట్స్ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) వి.వి. గణేష్ జెండా ఊపి ప్రారంభించారు. వయోవృద్ధుల ఆరోగ్యం, సంక్షేమం పట్ల సమాజంలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఎఫ్ఆర్ఓ రవికృష్ణ, రజిత, కమ్యూనిటీ ఎడ్యుకేటర్లు తేజస్వి, అనిత రెడ్డి, రాజేష్, జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీ సభ్యులు, మెయింటెనెన్స్ ట్రిబ్యునల్ కమిటీ సభ్యులు, పలు అసోసియేషన్ సభ్యులు, అనేక మంది వయోవృద్ధులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగి విశేష ప్రశంసలు అందుకుంది.

# పొగమంచు తీవ్రతురాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు మానుకోండి

సన్ ప్రీత్ సింగ్, పోలీస్ కమిషనర్

**వరంగల్, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)**

వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో రాత్రి, తెల్లవారుజామున వాహన ప్రయాణాలను వీలైనంతవరకు నివారించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు సూచించారు. దట్టమైన పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు, పాదచారులు స్పష్టంగా కనిపించకపోవడంతో ఇటీవలి రోజుల్లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. చిన్న నిర్లక్ష్యమే భారీ ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున అత్యవసరం అయితే తప్ప రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేయరాదని సీపీ విజ్ఞప్తి చేశారు. పొగమంచు సమయంలో వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించిన ఆయను వాహనాలను నిదానంగా నడపాలి, హెడ్‌లైట్లను లో బీమ్‌లో ఉంచాలి, ఫాగ్ లైట్లను వినియోగించాలి అని సూచించారు. తక్కువ వీక్షణ సామర్థ్యం కారణంగా మలుపులు, రోడ్డు విభాగాలు, ఇతర వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అత్యవసర ప్రయాణం తప్పనిసరి అయితే వాహనాల బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ఆకస్మికంగా ఓవర్‌టేక్ చేయడం, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం వంటి చర్యలు ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, పోలీసుల సూచనలను అనుసరిస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు.




## ఏడు నెలల గర్భంతో యువతి ఆత్మహత్య.. కట్న వేధింపుల ఆరోపణలు



**ములుగు జిల్లా, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)**

ఘనపూర్ మండలం బుద్ధారం గ్రామంలో చోటుచేసుకున్న విషాదకర ఘటన స్థానికులను కలచివేసింది. రెండు సంవత్సరాల క్రితం ప్రశాంత్‌కు వివాహమైన మౌనికపై అదనపు కట్నం కోసం వేధింపులు జరుగుతున్నాయని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఏడు నెలల గర్భిణి అయిన మౌనికను భర్త ప్రశాంత్ నిరంతరం వేధించడంతో మానసికంగా కుంగిపోయిందని వివరాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటిలోనే ఉరివేసుకొని మౌనిక ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఘటనతో కుటుంబం, గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఘనపూర్ పోలీసులు భర్త ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు వైద్య బృందం శ్రద్ధ




**జమ్మికుంట, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)**

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వృద్ధులకు రక్తపోటు, షుగర్ వంటి పలు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వరుణ మాట్లాడుతూ వృద్ధులు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రతిరోజూ కొద్దిపాటి వ్యాయామం, నడక, ధ్యానం వంటి వాటిని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఉదయం పూట సూర్య కిరణాల్లో కొంతసేపు ఉండటం ఆరోగ్యానికి మేలు చేస్తుందని పేర్కొన్నారు. అలాగే బీపీ, షుగర్ వంటి వ్యాధుల కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే మందులే సమర్థవంతంగా పనిచేస్తాయని, వాటితో ఆర్థిక భారం కూడా తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు చందన, మహోన్నత పటేల్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, సూపర్వైజర్ అరుణ, ఏఎన్ఎంలు మంజుల, కవిత, రజిత, వాణి, రాధ తదితరులు పాల్గొన్నారు.

## జాటో దేవ్ సింగ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**కొడకండ్ల, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)**

కొడకండ్ల మండలం మైదాం చెరువు తండా గ్రామ పంచాయతీ మాజీ వార్డు మెంబర్ జాటోత్ దేవ్ సింగ్ ఇటీవల మరణించిన విషయం తెలిసిన మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు నేడు వారి ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా దేవ్ సింగ్ చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళులు ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, వారి దుఃఖంలో తాము కూడా భాగస్వాములమని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్ పేరుతో నకిలీ టిటిడి లెటర్లు

విజయవాడ,నవంబర్ 17(జై భీమ్ న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేరుతో నకిలీ టీటీడీ లెటర్ల జారీపై విజయవాడ నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గత కొద్ది రోజులుగా మంత్రి పేరుతో నకిలీ టీటీడీ లెటర్లు జారీ చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కమిషనర్ కు సోమవారం నాడు మంత్రి సత్యకుమార్ పీఏ ఫిర్యాదు చేశారు. అయితే, టీటీడీ ఫేక్ లెటర్ల విషయాన్ని మంత్రి కార్యాలయం దృష్టికి బాధితులు తీసుకొచ్చారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ పేరుతో ఉన్న నకిలీ టీటీడీ ఫేక్ లెటర్ల జారీపై దర్యాప్తు చేయాలని పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు లెటర్ ను మంత్రి పీఏ అందజేశారు. ఇక, కేసును రిజిస్ట్రర్ చేసి దర్యాప్తు చేపడతామని విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు చెప్పారు. టీటీడీ ఫేక్ లెటర్లు ఇచ్చే వారి విషయంలో ప్రజలు జాగ్రత్త వహించాలని కోరారు.

## వెస్ట్ టు వెల్త్ ప్రదర్శనలో మెరిసిన అంబాల విద్యార్థినులు

అభినందించిన విద్యా అధికారులు



**కమలాపూర్, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, లష్కర్‌బజార్‌లోని జిల్లా సైన్స్ సెంటర్‌లో 'వెస్ట్ టు వెల్త్' అనే ఇతివృత్తంపై ఎకో క్లబ్ విద్యార్థులు రూపొందించిన అలంకరణ, గృహోపయోగ వస్తువుల ప్రదర్శన నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వేస్ట్ పదార్థాలతో కళాత్మక వస్తువులు తయారు చేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అంబాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రణిత, వైష్ణవి, ఝాన్సీ, మోసిన్ రూపొందించిన వస్తువులను అభినందిస్తూ ప్రధానోపాధ్యాయులు రోజా రమణి, మాజీ సర్పంచ్ కేత్తే రవి పారితోషికాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు ఉపయోగించిన వస్తువులను వృథాగా పారేయకుండా మళ్లీ ఉపయోగించే అలవాటు పెంపొందితే పరిసరాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా పెరుగుతున్న ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించవచ్చు. ఏక వినియోగ ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం చేయాలి" అని సూచించారు. ఇంట్లో ఏర్పడే చెత్తలో వేస్ట్‌గా భావించే పదార్థాల నుంచే ఉపయోగకరమైన వస్తువులు తయారు చేయవచ్చు. 'రిడ్యూస్%-%రియూజ్%-%రీసైకిల్' అలవాటు చిన్నప్పటి నుంచే పెంపొందించాలి. వ్యర్థాలను తిరిగి ఉపయోగించడం పర్యావరణ సంరక్షణలో ముఖ్యమైన అడుగు. పిల్లలు వ్యర్థ పదార్థాలతో వస్తువులు తయారు చేయడం ఆనందదాయకం మాత్రమే కాదు, కొత్త నైపుణ్యాలను నేర్చుకునే అవకాశం కూడా ఇస్తుంది అని విద్యా అధికారులు తెలిపారు. భోజనానంతరం జరిగిన పురస్కార కార్యక్రమంలో అంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బి. వైష్ణవి, బి. ప్రణీతలకు ప్రథమ బహుమతిని గాను నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఆంటీ కరప్షన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కాందారి ఉపాధ్యాయులు సంపత్, నరసింహరెడ్డి, శ్రీనివాసచార్య, భారతి, రజిత, అంజూమ్ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో పేదల ఇళ్ల కూల్చివేత - తీవ్ర ఉద్రిక్తత

**అశ్వారావుపేట, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్):**



అశ్వారావుపేటలో గత 10 ఏళ్లుగా నివసిస్తున్న పేద కుటుంబాల ఇళ్లను సోమవారం తెల్లవారుజామున అధికారులు హఠాత్తుగా కూల్చివేయడంతో ఘటనాస్థలి ఉద్రిక్తంగా మారింది. ముందస్తు నోటీసు లేకుండానే బుల్డోజర్లతో ఇళ్లను నేలమట్టం చేశారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చివేత సమయంలో మహిళలు, చిన్న పిల్లలు ఇంట్లోనే ఉన్నారని, భయానక వాతావరణం నెలకొందని వారు తెలిపారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, భూస్వాముల సూచనల మేరకే ఈ చర్య జరిగిందని కొందరు నివాసితులు ఆరోపించారు. పేదల గృహాలను రక్షించాల్సిన ప్రభుత్వమే వారిని నిరాశ్రయులను చేసిందని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు వెంటనే పునరావాసం కల్పించాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## కేయూలో కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



**హన్మకొండ నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల భాగంగా నాల్గో రోజు కార్యక్రమాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ యూనివర్సిటీ లైబ్రరీలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. తరువాత జరిగిన అవగాహన సభలో కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్.పీ. రాజ్‌కుమార్ విద్యార్థులకు ప్లేగరిజం నివారణ, వ్యక్తిత్వ వికాసం పై అవగాహన కల్పించారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే నిరంతరం మారుతున్న ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవడం అత్యంత ముఖ్యమని సూచించారు. కార్యక్రమానికి మరో అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ భారవి శర్మ పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి అన్న అంశంపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ ఇన్‌చార్జ్ పి. ఇసాక్ ప్రభాకర్, లైబ్రరీ అసిస్టెంట్ టి. జావెర్, సిబ్బంది టి. రమేష్, జి. శ్రీనివాస్, ఎన్. చంద్రమోహన్, పి. ఇందిరతో పాటు విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఫార్మాసీలో డాక్టరేట్ పొందిన మేకల సుమతికి బీఆర్ఎస్ నాయకుల అభినందనలు



**హసన్‌పర్తి, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)**

హన్మకొండ జిల్లా హసన్‌పర్తి గ్రామానికి చెందిన మేకల సుమతి (తండ్రి: మేకల పోచయ్య) శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయం, భోపాల్‌లోని ఫార్మసీ విభాగంలో పీహెచ్‌డీ పట్టా పొందిన సందర్భంగా హసన్‌పర్తి మేకలవారి వంశవేదిక ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వేదిక అధ్యక్షుడు యుగేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హసన్‌పర్తి 66వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ హాజరయ్యారు. సుమతిని, వారి తల్లిదండ్రులను అభినందించిన శ్రీధర్, ఆమె ఉన్నత విద్యలో సాధించిన విజయాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మిత్రులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొని సుమతికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు

కొత్త గైడ్‌లైన్స్‌లో ప్రభుత్వం జివో విడుదల

**అమరావతి,నవంబర్ 17(జై భీమ్ న్యూస్):**

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అంతర్ జిల్లా బదిలీలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్పౌజ్ గ్రౌండ్స్ ఆధారంగా ఇంటర్ డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అనుమతిస్తూ కొత్త గైడ్‌లైన్స్‌తో పాటు జీవోను రిలీజ్ చేసింది. ఈ ఆర్డర్లు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది సచివాలయ సిబ్బందికి ఉపశమనం కలిగించనున్నాయి. అయితే, ఈ బదిలీలు పూర్తిగా ఉద్యోగుల స్వచ్ఛంద రిక్వెస్ట్ ఆధారంగా మాత్రమే అమలు కానున్నాయి. అర్హత ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అప్లికేషన్ సమర్పించాలని వెల్లడించింది. అయితే, ట్రాన్స్‌ఫర్లు రిక్వెస్ట్ బేసిస్ మీద మాత్రమే అర్హులు అని ఏపీ సర్కార్ తెలిపింది. హజ్‌బెండ్/వైఫ్ ఇద్దరిలో ఒకరు ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండాలనే నిబంధన ఉంది. ప్రైవేట్ ఉద్యోగి అయితే స్పౌజ్ గ్రౌండ్స్ వర్తించదని పేర్కొనింది. ఇక,డిసిప్లినరీ లేదా ఏసీబీ కేసులు ఉన్నవారికి ట్రాన్స్‌ఫర్ కి అర్హత లేదన్నారు. అలాగే, నో డ్యూస్ సర్టిఫికేట్లు తప్పనిసరి చేసింది. మెరిట్ ర్యాంక్ ఆధారంగా సీనియారిటీ లిస్టులు ఉండనున్నాయి.

